## క్లుప్తంగా

### గడప గడపకూ కాంగ్రెస్



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం పట్టణ కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆశన్న, రాము, నరేష్, వెంకటయ్య, పాపన్న, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం మిషన్ వినియోగంపై అవగాహన



పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ మిషన్ వినియోగంపై గురువారం కళాజాతా బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఈవీఎం ఓటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 18ఏళ్లు నిండిన యువత, ప్రతి ఓటర్‌కు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వాతిగౌడ్, సువర్ణ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

### కౌన్సిల్ సమావేశం వాయిదా

వనపర్తి టౌన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఆకస్మికంగా వాయిదా పడింది. నాలుగు నెలలుగా మున్సిపల్ సమావేశం నిర్వహించకపోవడంతో ఈనెల సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని కౌన్సిలర్లు పట్టుబట్టడంతో గురువారం అధికార యంత్రాంగం మున్సిపల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు కార్యాలయంలో సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొద్ది సేపట్లో సమావేశం ప్రారంభం అవుతుందని భావించిన తరుణంలో రాఖీ పౌర్ణమి రోజు సమావేశం నిర్వహించవద్దని మహిళా కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు చివరి నిమిషంలో సమావేశం వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ గట్టుయాదవ్ ప్రకటించారు.

### ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



అమరచింత: రాఖీ పౌర్ణమి సందర్భంగా దేశంలోని మహిళామణులకు కానుకగా వంటగ్యాస్‌పై రూ.200 కేంద్ర ప్రభుత్వం తగ్గించడం సంతోషకరమంటూ ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ రేటు పెంచినప్పుడు గోల చేసిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఏకంగా రూ.200 తగ్గిస్తే మాట్లాడట్లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, ఎస్.వెంకటేశ్వర్లు, నరాల సిద్దిరాములు, రామలింగం, మాల విష్ణు, టైలర్ నరసింహులు, కృష్ణమూర్తి, రాకేష్ శెట్టి పాల్గొన్నారు.

### ఖోఖో పోటీలకు రుక్మిణి ఎంపిక



పెబ్బేరు: మండలంలోని యాపర్లకు చెందిన రుక్మిణి అంతర్జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు గురువారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కావలి చిన్ని వీరస్వామి కుమార్తె రుక్మిణి మలేషియాలో అక్టోబర్‌లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఖోఖో పోటీలో రాష్ట్రం తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రుక్మిణిని అభినందించారు. పోటీలో విజేతగా నిలిచి గ్రామానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాన్‌దిన్నెలో గురువారం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మచంద్రయ్య యాదవ్ తెలిపారు. గ్రామంలో లోవోల్టేజ్ విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఈ విషయాన్ని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా 25 కేవీ కేపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. దీంతో గ్రామంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం అయ్యిందని వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్‌రావు, చంద్రయ్య, అరవింద్, గాల్‌రెడ్డి, శంకరయ్య, నాగేశ్వి, రాజు, భీమ్లానాయక్ పాల్గొన్నారు.

# సాంకేతిక సొబగులు

- ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేత
- ట్యాబ్‌లతోనే విద్యార్థులకు బోధన



తెల్లరాళ్లపల్లి పీఎస్‌లో ట్యాబ్ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

పాన్‌గల్: ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత సాయంతో విద్యార్థులకు బోధించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఇటీవల ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వీటితో పాఠశాల సమగ్ర సమాచారం పొందుపర్చడంతో పాటు విద్యార్థులకు బోధన చేయనున్నారు.

**బడుల వివరాలు నమోదు**

పాన్‌గల్ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 31 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదివే విద్యార్థుల కోసం 34 ట్యాబ్‌లను జిల్లా సమగ్ర శిక్ష అధికారులు కేటాయించారు. పాఠశాలల సమాచారం, ప్రగతి పత్రాల వివరాలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, బాల బాలికల వివరాలు, మన ఊరు–మన బడి వివరాలు, ఐఎస్ఎంఎస్ పోర్టల్, వైల్డ్ ఇన్ఫో తదితర సమాచారం వీటిలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఉపాధ్యాయులు ఎలా పని చేస్తున్నారో తెలుసుకునేందుకు తెలంగాణ స్టేట్ టెక్నాలజికల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ప్రాథమిక స్థాయిలో వీటిని వినియోగించనున్నారు. 10 నుంచి 150 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున కేటాయించారు.

**పాఠాలు సులువుగా అర్థమయ్యేలా..**

ఉపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా బొమ్మలు చూపిస్తూ విద్యార్థులకు బోధన చేయనున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు పుస్తకాలను ఎస్‌సీఈఆర్‌టీ అంతర్జాలంలో నిక్షిప్తం చేశారు. వాటిని చూపిస్తూ ట్యాబ్‌లతో బోధన చేయనున్నారు. తరగతి గదిలో స్మార్ట్ వర్క్‌కు ప్రాధాన్యం పెరగనుంది.

### వివరాలు నమోదు చేసేందుకు..



ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో ఎంతో ఉపయోగకరం. విద్యార్థులకు బోధనతో పాటు పాఠశాలలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పని విధానాన్ని ఎక్కడి నుంచైనా తెలుసుకునే అవకాశం ఉంది.

– బండి శ్రీను, పీఆర్‌టీయూ నాయకుడు, పాన్‌గల్

### సులువుగా బోధన



ట్యాబ్‌ల ద్వారా బొమ్మలు చూపిస్తూ బోధన చేయడంతో పాఠాలు బాగా అర్థమవడంతో పాటు ఎక్కువ సేపు వినాలనిపిస్తుంది. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా ట్యాబ్‌లను వినియోగించి తరగతులు బోధిస్తున్నారు. దీంతో చదువు ఆసక్తి పెరిగింది.

– వెన్నెల, 4వ తరగతి, తెల్లరాళ్లపల్లి

### ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం



ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించాం. వీటి వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. వీటిని బోధనకు వినియోగించడంతో పాటు పాఠశాల సమగ్ర వివరాల నమోదుకు వినియోగించాలి. తద్వారా విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయుల పని విధానం ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

# భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం పూజలు



ఖిల్లాఘనపురంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయి బాబకు, దత్తాత్రేయస్వామికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు శ్రీరామట్రేడర్స్ అధినేత ఎలిశెట్టి విజయ్‌కుమార్, పద్మావతి దంపతులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, నిర్వాహకులు నవీన్, నీలేష్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

**నర్సింహస్వామికి..**

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పెద్ద గుట్టపై ఉన్న నర్సింహస్వామి పూజా కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పద్మశాలి కమిటీ వారు గుట్టపై ఉన్న నర్సింహస్వామి ఆలయం వద్దకు పెద్ద ఎత్తున చేరి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి పెద్దమందడి ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు మేఘారెడ్డి పాల్గొని స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.

**గోమాతకు..**

పెబ్బేరు రూరల్: శ్రావణ మాసం, రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని గోపూజ నిర్వహించి గోవును కాపాడాలని శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని సూగూర్‌లో ఆయన గోమాత పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం గోవుకు ఓ ప్రత్యేకమైన ఉందని, ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. మన పూర్వీకులు మనకు అందించిన సంపదగా భావించి గో సంరక్షణ చేయవలసిన బాధ్యత మన అందరిపై ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా భావించి గోవులను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పూజారి రామకృష్ణ శర్మ, రమేష్ పద్మ, అలివేల, చెన్నయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



సూగూర్‌లో..

# పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ



శాగాపూర్‌లో బియ్యం అందజేస్తున్న ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్



వీపనగండ్లలో..

పాన్‌గల్: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ తన సొంత ఖర్చులతో శాగాపూర్‌లో నిరుపేద దళిత కుటుంబాలకు గురువారం 2 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 కిలోల చొప్పున బుడ్డ కృష్ణయ్య, రాంచంద్రయ్య, నాగేశ్వు, పోచమ్మ, హరినాథం, ఉషనమ్మ, కృష్ణమ్మ, చిట్టెమ్మ కుటుంబాలకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం పంపిణీపై ఆయా కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు హలీంపాషా, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సర్పంచ్ రామేశ్వర్‌రావు, పార్టీ నాయకులు ఎత్తం బాలస్వామి, వేణుమాధవరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, వెంకటయ్య, రజాక్, రఘురెడ్డి, సాయిబాబ పాల్గొన్నారు.

చిన్నంబావి: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గం 20ఏళ్లుగా జరగని అభివృద్ధిని నాలుగున్నర ఏళ్లలో బీరం చేశారని, అలాంటి నాయకుడిని మరోసారి ఎమ్మెల్యే గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదన్నయాదవ్, బగ్గారి నరసింహారెడ్డి, తగరం లక్ష్మి, సర్పంచ్‌లు మద్దిలెట్టి, రామస్వామి, చక్రధర్ గౌడ్, శరత్‌కుమార్, పరమేష్ యాదవ్, మహేష్ యాదవ్, శరత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

# గోపాల్‌పేటలో కాంగ్రెస్‌కు రెండు కార్యాలయాలు



చాకల్‌పల్లిరోడ్డులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

గోపాల్‌పేట: మండలంలో మాజీ మంత్రి చిన్నారెడ్డి, మేఘారెడ్డికి చెందిన రెండు వర్గాలు తయారైనట్లు తెలుస్తోంది. మేఘారెడ్డి వర్గానికి చెందిన నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ పనులు హైదరాబాద్ రోడ్డులో కొనసాగుతున్నాయి. గురువారం మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనులను సత్యశీలారెడ్డితో కలిసి పరిశీలించారు. సెప్టెంబరు రెండో తేదీన పార్టీ కార్యాలయం ప్రారంభిస్తామని తెలిపారు. చిన్నారెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని చాకల్‌పల్లి రోడ్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి ప్రారంభించారు. మండల కేంద్రంలో ఒకే పార్టీకి చెందిన రెండు కార్యాలయాలు సిద్ధం కావడంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ అభాసుపాలు కావడం ఖాయం అని ప్రజలు బహిరంగంగానే అనుకుంటున్నారు. కొన్ని సభల్లో ఎవరికి పార్టీ టికెట్ వచ్చినా మరొకరు సపోర్టు చేస్తామని చెప్పి ఒకే పార్టీకి చెందిన రెండు కార్యాలయాలు ప్రారంభించడం అంటే పార్టీకి మేలు కంటే నష్టం జరిగే అవకాశమే ఎక్కువగా ఉందని నాయకులు వాపోతున్నారు

# భక్తమార్కండేయ జయంతి వేడుకలు



అమరచింతలో మార్కండేయ ఆలయంలో ప్రభుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూర్: పద్మశాలీల ఆరాధ్యదైవం భక్తమార్కండేయ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గురువారం స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూలి పౌర్ణమి మహోత్సవం సందర్భంగా పద్మశాలీల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరమశివుడికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి గాయత్రి మంత్రాన్ని జపించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పద్మశాలిసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గోరంట్ల వెంకటేష్, అధ్యక్షుడిగా మాకం సత్యం, ఉపాధ్యక్షుడిగా సైకిల్ నర్సింహ, సభ్యులుగా ఉమాశంకర్, కిరణ్, విజయప్రకాష్, రజనికాంత్, గోవర్ధన్, వెంకటేష్, కృష్ణయ్య, రవీంద్రను ఎన్నుకున్నారు.

అమరచింత: పద్మశాలీలు నూలు పౌర్ణమి (రాఖీపౌర్ణమి)ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ప్రభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి పట్టణ అధ్యక్షుడు దేవరకొండ లక్ష్మన్న మాట్లాడుతూ తమ కుల వృత్తి అయిన చేనేతకు అవసరం అవుతున్న నూలు పోగు పుట్టిన రోజును పురస్కరించుకొని నూలు పౌర్ణమిని ప్రతి ఏడాది వైభవగా జరుపుకుంటామని తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పారుపల్లి చింతన్న, మహంకాళీ ప్రభాకర్ పాల్గొన్నారు.

### కేసు నమోదు

ఆత్మకూర్: విద్యుదాఘాతంతో మృతిచెందిన కార్మికుడు బాలకృష్ణ (22) కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ బీచుపల్లి తెలిపారు. బుధవారం సాయంత్రం భవన నిర్మాణ పనుల్లో విద్యుదాఘాతానికి గురై మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతి చెందాడు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

### రూ.1.50లక్షల విలువైన మద్యం పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం చౌరస్తా వద్ద ఉన్న హోటల్లో రూ.1.5లక్షల విలువ చేసే మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రవిప్రకాశ్ తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన రాజు హోటల్‌లో మద్యాన్ని కూడా విక్రయిస్తుండడంతో గురువారం సాయంత్రం ఆకస్మికంగా హోటల్‌ని తనిఖీ చేయగా 27 బీర్ కాటన్లు, వివిధ రకాల 15 లిక్కర్ కాటన్లు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



సూగూర్‌లో ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అంజనగిరికి చెందిన శంకర్ మృతి చెందారు. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచనల మేరకు గురువారం వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వారి వెంట సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దేవన్న, ధర్మేందర్, రాజు, యాది తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు మండలంలో..**

సూగూర్‌లో కేశపాక బతుకమ్మ మరణించడంతో బీఆర్‌ఎస్ నాయకుడు వంగూర్ ప్రమోద్‌రెడ్డి రూ. 5 వేలు అందించారు. బున్యాధిపూర్‌లో ఈరపాగ బాలకిష్టయ్యకు పెరాలసిస్‌తో బాధపడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేఘారెడ్డి రూ.5 వేలు అందజేశారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లికి చెందిన ఎత్తపు కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి యూ. ఐదు వేల ఆర్థికసాయం పంపగా.. జెడ్పీటీసీ సభ్యుడు భీమయ్య గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందించారు.

### ఇంటింటి ప్రచారం

కోడేరు: మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి గ్రామాల్లో టీడీపీ కొల్లాపూర్ ఇన్‌చార్జ్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పగిడాల శ్రీనివాసులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సాయిదీరజ్, రామస్వామి, గోపాలకృష్ణ, రామకృష్ణ, విజయభాస్కర్, చందన్‌గౌడ్ పాల్గొన్నారు.

# అనుబంధానికి ప్రతీక 'రాఖీ'



వనపర్తిలో కలెక్టర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

సాక్షి, నెట్‌వర్క్: అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బంధుత్వాలను, సోదర భావాన్ని పెంపొందించే రాఖీ పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకొన్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. సోదరుల నుంచి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్‌కు చిన్నారులు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి శాగాపూర్ సర్పంచ్ మౌనికయాదవ్ రాఖీ కట్టారు.



కొల్లాపూర్‌లో..



ఏదులలో..



వీపనగండ్లలో..



వెల్టూర్‌లో..



పామిరెడ్డిపల్లిలో..



పెబ్బేరులో..



ఆత్మకూర్‌లో..



అమరచింతలో..

### మానాజీపేటలో రక్తదాన శిబిరం

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కీ.శే వెంకట్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ ఆశీస్సులతో డయల్ యువర్ విలేజ్ ప్రోగ్రాం కన్వీనర్ మేరెడ్డి రవిప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి వారి సౌజన్యంతో సర్పంచ్ సతీష్‌కుమార్ ఉచిత వైద్య, రక్తదాన శిబిరం ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. రక్షా బంధన్ రోజున ప్రత్యేకంగా వృక్షా బంధన్ కార్యక్రమాన్ని ప్రారంభించి చెట్లు, మానవులకు ఉన్న సంబంధం గురించి వివరించారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణరెడ్డి, శ్రీధర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాంచంద్రయ్య, కృష్ణారెడ్డి, డయల్ యువర్ విలేజ్ నిర్వాహకులు శ్రీకాంత్, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

